ఈనాడు
epaper.eenadu.net

# అక్షర సంపాదకులే తరతరాలు గుర్తుంటారు

- **గోరాశాస్త్రి శత జయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: చాలా మంది సంపదను రూపాయల్లో లెక్కిస్తారని.. కానీ అక్షరాల్లో లెక్కించేవారినే తరతరాలుగా ప్రపంచం గుర్తుంచుకుంటుందని.. అలాంటి వ్యక్తి గోరాశాస్త్రి అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆయన ఆంగ్లంలో, తెలుగులో ఒకే శైలితో సంపాదకీయాలు రాసిన సవ్యసాచి అని శ్లాఘించారు. సాహిత్య అకాడమీ, వయోధిక పాత్రికేయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గోరాశాస్త్రి శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి మాట్లాడారు. గోరాశాస్త్రి, తాపీ ధర్మారావు తదితరుల చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపరాష్ట్రపతి.. సాహిత్య అకాడమీ.. గోరాశాస్త్రి చిత్రంతో ముద్రించిన పుస్తకాన్ని, వినాయకుడి వీణ అనే మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు, వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు జీఎస్ వరదాచారి, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడమీ సంచాలకులు కె. శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోరాశాస్త్రి శతజయంతి వేడుకల్లో వెంకయ్యనాయుడు సుదీర్ఘంగా ప్రసంగించారు. అందులో అనేక చెణుకులను, చమత్కారాలను జోడించారు. అవి..

### రాజకీయ పార్టీలో ఎవరు? ఎప్పుడు? ఎక్కడ?

నేడు దేశంలో రాజకీయం నవ్వులాటగా మారింది. పార్టీల్లో ఎవరు ఎప్పుడు ఎక్కడుంటారనే విషయం వారికే తెలియదు. మనకూ తెలియదు. మొన్న టీవీలో ఒకరు మాట్లాడుతూ పాత పార్టీ గుర్తుకు జై అన్నారు. రాజకీయం అంత నవ్వులాటగా తయారైంది. రైళ్లు, బస్సుల రాకపోకల్లాగా రాజకీయపార్టీలో ఎవరు ఎక్కడ? ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అని పెడితే బాగుంటుంది.

### ప్రభుత్వ ఉద్యోగం.. ఇదీ వాస్తవం

ప్రభుత్వ ఉద్యోగం అంటే బాధ్యతలేనిదని చాలా మంది ఉద్దేశం. అది వాస్తవం కాదు. చిన్నదైనా సరే ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే వెళ్లినా వెళ్లకున్నా జీతం వస్తుందనే భావన ఉంది. కానీ పరిస్థితులు మారుతున్నాయి. ప్రైవేటు రంగం దాని స్థానం ఆక్రమిస్తోంది. ప్రతిభ ఉన్నవారికే అవకాశాలు లభిస్తున్నాయి.

### 'సూపర్ 30' సినిమా అద్భుతం..

తాజాగా సూపర్ 30 చిత్రం చూశాను. ఎంతో అద్భుతంగా ఉంది. గణితశాస్త్ర ఉపాధ్యాయుడు సొంతంగా డబ్బులు ఖర్చుచేసి పేద పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తాడు. కార్పొరేట్ సంస్థలు ఆయనను దెబ్బకొట్టడానికి చూస్తాయి. వాటిని తట్టుకొని పేద పిల్లలకు మంచి భవిష్యత్తునిస్తాడు. ఆ సినిమా నన్ను ఉద్వేగానికి గురిచేసింది.

### వయోధిక కాదు.. వరిష్ఠ

వయోధిక పాత్రికేయుల సంఘం అని చదవడానికి ఇబ్బందిగా ఉంది. తెలుగు కాకున్నా వరిష్ఠ అని పిలుస్తాను. కొద్ది రోజుల్లో నాది ఇదే పరిస్థితి కాబట్టి ఇలా పిలవాల్సి వస్తోంది.

Date : 21/07/2019 EditionName : GREATER HYDERABAD PageNo : 13

# సాహితీ సవ్యసాచి గోరాశాస్త్రి!

## ఆయన సంపాదకీయాలు జ్ఞాన మార్గాలు.. గోరాశాస్త్రి జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

### పుస్తకావిష్కరణలో ఉపరాష్ట్రపతి వెంకయ్య

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సంపదను ప్రతి ఒక్కరూ రూపాయల్లో లెక్కిస్తారని, అయితే సంపదను నిండైన పదజాలంతో అక్షరాల్లో లెక్కించిన సాహితీ మూర్తి గోవిందు రామశాస్త్రి(గోరా శాస్త్రి) అని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. గోరాశాస్త్రి సాహితీ సవ్యసాచి అని, ఈ తరం జర్నలిస్టులకు ఆయన జీవితాన్ని, సంపాదకీయాలను పాఠ్యాంశాలుగా బోధించాలని ఆయన సూచించారు. కేంద్ర సాహిత్య అకాడమీ, వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో గోరాశాస్త్రి శతజయంతి సదస్సు హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో శనివారం జరిగింది. ఈ సదస్సుకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'గోరాశాస్త్రి సంపాదకీయాలు జ్ఞానసంపాదనకు మార్గాలు. ఆయన్ను గౌరవించుకోవడం భారతీయ సంస్కృతిలో భాగం. గోరాశాస్త్రి జీవితాన్ని ఈతరం పాత్రికేయులు ఆదర్శంగా తీసుకోవాలి.' అని వెంకయ్యఅన్నారు. తెలుగు,ఆంగ్ల భాషల్లో ఏకకాలంలో సంపాదకీయాలు రాయగల సాహితీ సవ్యసాచిగా గోరా శాస్త్రి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. ఏ భాషలో రాసినా చణుకులు, చతురత, విమర్శలలో పరిధి దాటలేదని, ఆయన సంపాదకీయాల కోసమే ఆ రోజుల్లో పత్రికలను పాఠకులు కొనుగోలు చేసేవారని అన్నారు. నిజాన్ని నిష్కర్షగా, కుండబద్దలు కొట్టినట్టు రాయడం గోరాశాస్త్రి ప్రత్యేకత అనీ, హాస్యం, వ్యంగ్యం, విమర్శను సమపాళ్లలో రంగరించి రాయడం అంత సులభం కాదని అన్నారు. 'లోక్‌నాయక్' జయప్రకాశ్ నారాయణ్ మరణం తర్వాత సంపాదకీయంలో రాసిన వాక్యాలు తానిప్పటికీ మరిచిపోలేదని వెంకయ్య పేర్కొన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, గోరాశాస్త్రి మంచి స్నేహితులని, పీవీ ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో ఆయన ప్రభుత్వ తీరును తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. దీని వల్ల వారి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. గోరాశాస్త్రి ఏ పార్టీకీ, వర్గానికీ చెందని వ్యక్తి అనీ, తన సన్నిహితులైన వారిని సైతం సునిశితంగా విమర్శించడంలో ఏనాడూ సంకోచించలేదని అన్నారు. ఆయన ప్రతి సంపాదకీయం పాఠకుడితో మాట్లాడినట్లు ఉండేదని తెలిపారు.

### రాజకీయ నేతలపై గౌరవం తగ్గుతోంది!

'ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పార్టీకి నిర్దిష్టమైన ఆర్థిక సిద్ధాంతాలు అవసరం. దేశంలోని అన్ని పార్టీలూ ప్రజాస్వామ్యానికి కొలబద్దలు కావు. అవి విచిత్ర సమాఖ్యలు' అని గోరా శాస్త్రి తన రచనల్లో పేర్కొన్నారని వెంకయ్యనాయుడు అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాజకీయ నేతలపై గౌరవం తగ్గుతోందని పేర్కొన్నారు.





గోరా శాస్త్రి సంపాదకీయాల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. వేదికపై కవి శివారెడ్డి, జీఎస్ వరదాచారి, శ్రీనివాసరావు తదితరులు

### అక్షరంగా ఎదగాలనుకున్నాడు మా నాన్న: సునంద

గోరాశాస్త్రి కూతురిగా పుట్టడం తన అదృష్టమని ఆయన కుమార్తె సునంద అన్నారు. 'మా నాన్న ఆర్థికంగా ఎదగాలనుకోలేదు. అక్షరంగా ఎదగాలనుకున్నారు. నాన్న ఆస్తి సంపాదించలేదని మేము ఏనాడూ అనుకోలేదు. ఆయన మాకు నేర్పిన విలువలే అసలైన ఆస్తి.' అని ఆమె చెప్పారు.

### 'ఆంధ్రజ్యోతి'కి ప్రశంస

ఆంధ్రజ్యోతి దినపత్రికను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. 'తెలుగు దినపత్రికల్లో సాహిత్యానికి ప్రాధాన్యం తగ్గిపోయింది. అయితే ఆంధ్రజ్యోతి మాత్రం సాహిత్య రచనలకు మంచి ప్రాముఖ్యం ఇస్తోంది.' అని కొనియాడారు. సాహిత్యం, కవిత్వం మనసుని రంజింపచేస్తాయని, కాలక్రమేణా సాహిత్యం ప్రాధాన్యం కోల్పోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 'సూపర్ 30' సినిమా చూశానని, తాను ఎంతో ప్రభావితమయ్యానని పేర్కొన్నారు. వార్తలు సత్యానికి దగ్గరగా, సంచలనాలకు దూరంగా ఉండాలని, వార్తాసంస్థలు వ్యక్తిగత, వ్యాపార సాధనాలు కారాదని అన్నారు. సృజనాత్మక జర్నలిజాన్ని ప్రోత్సహించాలని, నైతిక, స్వతంత్ర నిబంధనలను ఉల్లంఘించవద్దని చెప్పారు. వార్తలు, విశ్లేషణలు వేర్వేరు అని, తప్పుడు వార్తలకు దూరంగా ఉండాలని వెంకయ్యనాయుడు సూచించారు.



గోరా శాస్త్రి సంపాదకీయాల సంకలనం 'వినాయకుడి వీణ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో వరదాచారి, శివారెడ్డి తదితరులు

# నిండైన పదజాలం గోరా శాస్త్రి సొంతం

- శతజయంతి ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- నిజాన్ని నిర్భయంగా రాశారు
- ఆయన సంపాదకీయాలు జ్ఞానసంపాదనామార్గాలు
- జర్నలిస్టులకు ఆయన జీవితం పాఠం కావాలి

హైదరాబాద్: సంపదను ప్రతిఒక్కరూ రూపాయల్లోనే లెక్కిస్తారని, కానీ దానిని నిండైన పదజాలంతో అక్షరాల్లో లెక్కించిన సాహితీమూర్తి గోవిందు రామశాస్త్రి(గోరా శాస్త్రి) అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కొనియాడారు. సంపదను అక్షరాలతో లెక్కించేవారిని ప్రపంచం గుర్తిస్తుందని, అదే మార్గంలో గోరా శాస్త్రిని నేటికీ స్మరించుకుంటున్నామని అన్నారు. సాహిత్యఅకాడమీ, వయోధిక పాత్రికేయ సంఘం సంయుక్తంగా శనివారం ఇక్కడి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన గోరా శాస్త్రి శతజయంతి ఉత్సవాలకు వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'గోరా శాస్త్రి అంటే సంపాదకీయాలు, సంపాదకీయాలంటే గోరా శాస్త్రి'అన్నంతగా పేరు సంపాదించుకున్నారని, అలాంటివారిని గౌరవించుకోవడం భారతీయ సంస్కృతిలో ఒక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం మీద మక్కువ చూపించే పరిస్థితుల్లో ఉద్యోగాన్ని వదిలి జర్నలిజం, సాహిత్యం మీద ఆయన ఆసక్తి కనబరిచారని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ఏకకాలంలో సంపాదకీయాలు రాసి సాహితీ సవ్యసాచిగా పేరు సంపాదించుకున్నారని అన్నారు. ఆయన సంపాదకీయాలను పాఠకులు జ్ఞానసంపాదనామార్గాలుగా భావించేవారని గుర్తుచేశారు. ఈ తరం జర్నలిస్టులకు ఇలాంటి ఆదర్శప్రాయుడి జీవితాన్ని, సంపాదకీయాలను పాఠాలుగా బోధించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో స్వతంత్ర పత్రికకు పనిచేసిన ఆయన ఆ తర్వాత ఆంధ్రభూమి సంపాదకుడిగా తెలుగు ప్రజలకు చేరువయ్యారని పేర్కొన్నారు. ఆయన సంపాదకీయాల కోసమే ఆ రోజుల్లో పత్రికలను కొనేవారన్నారు. నిజాన్ని నిష్కర్షగా రాయడం ఆయన ప్రత్యేకత అని, హాస్యాన్ని, వ్యంగాన్ని, విమర్శను సమపాళ్లలో కలుపుతూ రాయడం ఆయనకే సాధ్యమైందని అన్నారు. కలగూరగంప పార్టీలు ఓ విచిత్రమైన సమాఖ్య అని గోరా శాస్త్రి ఏనాడో చెప్పారని, అది నేటి రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతోందన్నారు.

## అమ్మమ్మ ఇంటికి వచ్చినట్టుగా ఉంది

తెలుగు పాత్రికేయులందరినీ ఇలా ఒకేచోట కలవడం ఆనందంగా ఉందని, అమ్మమ్మ ఇంటికి వచ్చినట్లుగా అనుభూతి కలుగుతోందని వెంకయ్యనాయుడు అన్నా రు. ఇలాంటి కార్యక్రమాలు తెలుగు భాషకు, పాత్రికేయవృత్తికి మరింత గౌరవం తెచ్చిపెడతాయని అభిప్రాయపడ్డారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే శక్తి సాహిత్యానికే ఉందని, ముఖ్యంగా మాతృభాషాసాహిత్యం మనగతాన్ని తెలియజేస్తుందని, ఇప్పుడు పత్రికల్లో సాహిత్యం కరువైందని అన్నారు. ఈ సందర్భంగా గోరా శాస్త్రి సంపాదకీయాల సంకలనం 'వినాయకుడి వీణ' పుస్తకం, మోనోగ్రాఫ్ పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి కె. శివారెడ్డి, సాహిత్యఅకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు జి.ఎస్.వరదాచారి, కె.లక్ష్మణ్‌రావుసహా పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

సాక్షి Sun, 21 July 2019
https://epaper.sakshi.com/c/41611695



వార్త, హైదరాబాద్, ఆదివారం 21 జులై 2019

# సాహితీ సవ్యసాచి గోరా శాస్త్రి

- నిజాన్ని నిర్భయంగా చెప్పారు
- జర్నలిస్టులకు ఆదర్శప్రాయులు
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శనివారం హైదరాబాద్‌లో జరిగిన గోరా శాస్త్రి శత జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** తెలుగు, ఆంగ్ల భాషల్లో ఏక కాలంలో సంపాదకీయాలు రాయగల సాహితీ సవ్యసాచిగా గోవింద రామ శాస్త్రి పేరు సంపాదించుకున్నారని, సంపదను ప్రతిఒక్కరూ రూపాయల్లోనే లెక్కిస్తారని, నిండైన పదజాలంతో సంపదను అక్షరాల్లో లెక్కించిన సాహితీమూర్తి గోరాశాస్త్రి అని ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రశంసించారు. సంపదను అక్షరాలతో లెక్కించే వారిని ప్రపంచం గుర్తిస్తుందన్నారు. అదే మార్గంలో గోరాశాస్త్రిని నేటికీ స్మరించుకుంటున్నామని తెలిపారు. సాహిత్య అకాడమీ, వయోధిక పాత్రికేయ సంఘం సంయుక్తంగా హైదరాబాద్‌లోని డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శనివారం నిర్వహించిన గోరాశాస్త్రి శత జయంతి ఉత్సవాల్లో ఉప రాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. గోవింద రామశాస్త్రి అంటే సంపాదకీయాలు, సంపాదకీయాలు అంటే గోరాశాస్త్రి అన్నంతంగా ఆయన పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. అలాంటి వారిని గౌరవించుకోవడం భారతీయ సంస్కృతిలో ఒక భాగమని, వారి జీవితాన్ని ఈతరం పాత్రికేయులు ఆదర్శంగా తీసుకోవాలని ఉప రాష్ట్రపతి సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి జర్నలిజం, సాహిత్యంమీద వారు ఆసక్తి కనబరిచారని తెలిపారు. గోరాశాస్త్రి ఏ భాషలో రాసినా చణుకులు, చతురత, విమర్శల విషయంలో పరిధిదాటి వెళ్లలేదన్న ఉప రాష్ట్రపతి వారి సంపాదకీయాలను పాఠకులు జ్ఞాన సంపదకు మార్గాలుగా భావించేవారని గుర్తు చేశారు. ఈతరం జర్నలిస్టులకు ఇలాంటి మహనీయుడి జీవితాన్ని, సంపాదకీయాలను పాఠాలుగా బోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో స్వతంత్ర పత్రికకు పనిచేసిన ఆయన ఆ తరువాత ఆంధ్రభూమి సంపాదకులుగా తెలుగు ప్రజలకు, సాహితీకారులకు అత్యంతచేరువయ్యారని తెలిపారు. వారి సంపాదకీయాలకోసమే ఆ రోజుల్లో పత్రికలను కొనేవారని తెలిపారు. నిజాన్ని నిష్కర్షగా కుండబద్దలు కొట్టినట్లు రాయడం గోరాశాస్త్రి ప్రత్యేకతన్నారు. హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, విమర్శలను సమపాళ్లలో కలుపుతూ రాయడం అంతసులభం కాదని తెలిపారు.

ఈ సందర్భంగా గోరాశాస్త్రి సంపాదకీయాల సంకలనం వినాయకుడి వీణ పుస్తకం, మోనోగ్రాఫ్ పుస్తకాన్ని ఉప రాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు వరదాచారి, లక్ష్మణరావుసహా పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

'Gora Sastri was fearless, forthright and a fountainhead of knowledge'.

https://www.thehindu.com/news/cities/Hyderabad/gora-sastri-was-fearless-forthright-and-a-fountainhead-of-knowledge/article28622076.ece

Don't breach standards of ethical journalism, Vice President cautions media.

http://www.5dariyanews.com/news/269549-Dont-breach-standards-of-ethical-journalism-Vice-President-cautions-media